ప్రజాశక్తి

ఆదివారం 14 మే 2023

5

శ్రీకాకుళం

వికలాంగుల వసతిగృహంలో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం : వికలాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన శ్రీకాకుళంలో చలన సంబంధ, బధిర, అంధ, వికలాంగ బాలికల వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ఎడి కవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో వసతిగృహం ఉందని, ఇందులో ప్రవేశానికి 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి పదో తరగతి, ఇంటర్, ఆపై తరగతులు చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఉచిత భోజన, వసతి, నోట్ పుస్తకాలు, యూనిఫారం, కాస్మొటిక్ ఛార్జీలు తదితర సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఎడి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు 08942 240519, 8074777210, 9951971764 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

యువ నేత నిద్ర... శ్రేణులకు భంగం

- పార్టీ కార్యక్రమాలతో ఇప్పటికే శ్రేణుల బిజీ
- పల్లె నిద్ర పేరుతో రామ్‌మనోహర్ నాయుడు హడావుడి
- అధికారులు లేకుండా ఏం ప్రయోజనమని పెదవి విరుపు
- విసుక్కుంటున్న కేడర్

రాష్ట్రంలో ఎవరూ చేయని కార్యక్రమం చేసి ఒక ట్రెండ్ సృష్టిద్దామనుకున్నారు ఆ యువ నేత... గడప గడపకు మన ప్రభుత్వం అందరూ చేస్తున్నారు కాబట్టి అందులో కొత్తదనం ఉండదనుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా వినూత్నంగా ఏదైనా చేయాలని భావించారు. అంతలోనే ఆ 'చిన్ని' బుర్రకు ఆలోచన వచ్చింది. అప్పుడెప్పుడో పార్టీ అమలు చేయాలని నిర్ణయించి ఆపేసిన 'పల్లె నిద్ర'ను భుజానికెత్తుకున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంతో శ్రీకారం చుట్టేస్తే, రాష్ట్రవ్యాప్తంగా తామే రోల్ మోడల్ కాగలమనుకున్నారు. అనుకున్నదే తడవుగా పల్లె నిద్రకు ఉపక్రమించారు యువనేత, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తనయుడు రామ్‌మనోహర్ నాయుడు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్ తదితర కార్యక్రమాలతో బిజీగా ఉంటున్న పార్టీ శ్రేణులు, పల్లె నిద్రపై పెదవి విరుస్తున్నారు. అధికారులతో కలిసి ప్రతి ఇంటికీ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకునే కార్యక్రమాలు చేస్తుండగా, అధికారులు లేకుండా పల్లెల్లో పడుకుంటే ప్రయోజనమేమిటని విసుక్కుంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

2019 సాధారణ ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా ధర్మాన గెలిచిన తర్వాత ఆయన తనయుడు రామ్‌మనోహర్ నాయుడు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ప్రభుత్వ కార్యక్రమాలు, వ్యవహారాల్లో తీరిక లేకుండా ఉండడంతో పార్టీపరమైన కార్యక్రమాల్లో యువ నేతే పాల్గొంటున్నారు. ప్రభుత్వం ప్రారంభించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగస్వామ్యమవుతూ వస్తున్నారు. ఇవి చేస్తే ఏం పేరు వస్తుందని అనుకున్నారేమో..! ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, అధిష్టానం దృష్టిలో పడేలా ఏదైనా కార్యక్రమం చేస్తే బాగుంటుందని భావించారు. పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టి ప్రజలను కలుసుకోవాలని గట్టిగా నిర్ణయించారు. శ్రీకాకుళం మండలం నైరలో తొలుత ప్రారంభించి శ్రీకూర్మం, కొత్తపేటలో మూడు చోట్ల పల్లె నిద్ర చేశారు. యువ నేత పల్లె నిద్ర పక్కన పెడితే ఆయన పర్యటిస్తున్న గ్రామాల్లో నాయకులకు, పార్టీ కేడర్‌కు నిద్ర లేకుండా పోతోంది. అసలే మంత్రి గారి తనయుడు పిలిచిన తర్వాత వెళ్లకపోతే ఆగ్రహిస్తారేమోనని కొందరు, మొహమాటానికి మరికొందరు వెళ్తున్నారు. గ్రామాలకు వెళ్తున్నట్లు స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండానే వెళ్లి కబురు పెడుతుండడంతో నాయకులు, కార్యకర్తలు ఉరుకులు, పరుగులు మీద వచ్చి యువ నేత ప్రచారంలో పాల్గొంటున్నారు.

పల్లె నిద్రతో ఏం మేలు ఒనగూరుతుందో?

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిపి పల్లె నిద్ర చేపట్టాలని నిర్ణయించింది. అదే లక్ష్యంతో ప్రభుత్వం గడప గడపకు కార్యక్రమాన్ని రూపకల్పన చేసి అమలు చేస్తుండడంతో, ప్రస్తుతం పల్లె నిద్రకు స్వస్తి పలికింది. ఆ పల్లె నిద్ర కాన్సెప్ట్‌నే యువ నేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అమలు చేస్తుండడంతో అదనంగా జనానికి ఏం ప్రయోజనం ఒనగూరుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా అధికారులు లేకుండా సమస్యలను ఎవరు పరిష్కరిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేవలం జనాన్ని పలకరించడానికైతే పల్లె నిద్ర చేపట్టాల్సిన అవసరమేమిటనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, జగనన్నే మన భవిష్యత్‌తో నాయకులు, కార్యకర్తలు తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. అదనంగా పల్లె నిద్ర పేరుతో ఇంటింటికీ వెళుతుండడంతో మాకెందుకీ తలనొప్పి అంటూ నాయకులు, కార్యకర్తలు విస్కుంటున్నారు.

పగలు మానేసి రాత్రులు గడప గడపకు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అటు ప్రభుత్వం, ఇటు పార్టీ సీరియస్‌గా తీసుకుంటోంది. ఎమ్మెల్యేలు పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తూ వెనుకబడిన వారిని కాస్త కఠినంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హెచ్చరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గడప గడపకు మన ప్రభుత్వాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు 94 సచివాలయాలను సందర్శించాల్సి ఉండగా, ఇప్పటివరకు 56 సచివాలయాల్లో పర్యటించారు. ఇంకా 38 సచివాలయాలకు వెళ్లి ప్రజలను కలుసుకోవాల్సి ఉంది. ఇచ్చిన ఈ లక్ష్యాన్ని చేరుకోవడంపై దృష్టిసారించకుండా రాత్రులు పల్లెల్లో పడుకుంటే ఏం ప్రయోజనమన్న అభిప్రాయం ఆ పార్టీ నాయకుల్లో వ్యక్తమవుతోంది.

యువనేత తీరుపై కేడర్‌లో అసహనం

యుతనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు తీరుపై పార్టీ కేడర్‌లో అసహనం వ్యక్తమవుతోంది. గ్రామాల్లో పర్యటనకు వెళుతున్నప్పుడు తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని కొందరు నాయకులు నొచ్చుకుంటున్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఏం అనుకుంటారోనని పల్లె నిద్రకు బలవంతంగా హాజరవుతున్నట్లు తెలుస్తోంది. యువ నేత సొంత పోకడలతో పార్టీకి నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కొనసాగితే భవిష్యత్‌లో పార్టీకి ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- 'ఎల్‌హెచ్‌ఎంఎస్'ను సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆస్తి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఆస్తి సంబంధిత నేరాలపై పోలీస్ స్టేషన్ల వారీగా నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు శాఖ అందిస్తున్న ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాత్రివేళల్లో గస్తీని పకడ్బందీగా అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. పలురకాల నేరాల సరళిని పరిశీలించి, నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నేరస్తులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ముమ్మరంగా గస్తీ తిరగాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో దొంగతనాలు చేసేవారు లాడ్జీల్లో ఉండేందుకు వస్తుంటారని, రాత్రి వేళల్లో లాడ్జీలను ఆకస్మిక తనిఖీ చేసి సిసి కెమెరాలను పర్యవేక్షించాలని సూచించారు. లాడ్జి నిర్వాహకులు కచ్చితంగా బస చేసిన వారి పూర్తి వివరాలు, చిరునామాతో కూడిన గుర్తింపు కార్డు రిజిస్టర్‌లో పొందుపరచాలని స్పష్టం చేశారు. పగటి పూట, రాత్రివేళ గస్తీలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. వాహనాల తనిఖీలు నిర్వహించాలని, అనుమానిత వ్యక్తులను వారి ఫింగర్ ప్రింట్ ద్వారా వెరిఫై చేయడం ద్వారా పాత నేరస్తులను గుర్తించేందుకు వీలుంటుందని తెలిపారు. ఎస్ఐ స్థాయి అధికారి స్వయంగా గస్తీలు నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు చూడాలన్నారు. డిఎస్‌పి, సిఐలు వారి పరిధిలో గస్తీలను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కువగా నేరాలు జరుగుతున్న పోలీస్ స్టేషన్ల పరిధిలో గస్తీలను పెంచాలని సూచించారు. బ్యాంకు, ఎటిఎం, వ్యాపార సముదాయాలు, ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నేరాలను నియంత్రించేందుకు, జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మహిళా పోలీసులు, జాగృతి బృందాల ద్వారా విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వర్, సిసిఎస్ సిఐ వెంకటేశ్వరరావు, డిసిఆర్‌బి సిఐ ప్రసాదరావు, ఫింగర్ ప్రింట్ విభాగం ఎస్ఐ భరత్ కుమార్ పాల్గొన్నారు.

21 నుంచి ఈ-ప్రగతి సేవలు నిలుపుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 21వ తేదీ నుంచి ఈ–ప్రగతి సేవలు నిలిపివేస్తున్నట్లు జిల్లా రవాణా ఇన్‌ఛార్జి కమిషనర్ డిసి రాజరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ–ప్రగతి సర్వీసులకు సంబంధించి ఈనెల 20వ తేదీ లోగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇతరత్రా కార్యకలాపాలు ఉంటే సాధ్యమైనంత త్వరలో వాటిని నిర్వహించుకోవాలని సూచించారు. ఈనెల 26వ తేదీ నుంచి సారథి నిక్ సర్వీసుల ద్వారా అన్ని ఆర్‌టిఎ పనులు, డ్రైవింగ్ లైసెన్స్ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు.

ఇనాం భూములకు మోక్షం కలిగిస్తాం

పశు సంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఇనాం భూములకు మోక్షం కలిగిస్తామని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పూడి జగన్నాథపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా భూములను అనుభవిస్తున్న రైతులు హక్కు పత్రాల్లేక ఇబ్బందులకు గురవుతున్నారని రీ సర్వేలో ఇనాం భూ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమస్య పరిష్కారం వల్ల మండలంలో సుమారు 388 ఎకరాలు సాగు చేస్తున్న 150 మంది రైతులు ప్రయోజనం పొందుతారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పూడిలంకలో మూసివేసిన పాఠశాలను తెరిపించామని, త్వరలోనే పూడిలంక రహదారికి పరిపాలనాపరమైన అనుమతులు తీసుకొస్తామన్నారు. పంచాయతీలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని చెప్పారు. పంచాయతీ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీనిచ్చారు. కడుపులో ఉన్న బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతిఒక్కరికీ ఉపయోగపడే అనేక రకాల పథకాలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పారదర్శకంగా అందిస్తోందని తెలిపారు. విజ్ఞతతో ప్రజలు ఆలోచించి వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చెయాలని కొరారు. పొరపాటున చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తారని, ఇప్పుడు అందుతున్న పథకాలేవీ ప్రజలకు అందవని చెప్పారు. సర్పంచ్ బత్తిని ప్రసాదరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు పుక్కల గురయ్యానాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, ఎంపిటిసి కె.వెంకటరావు, మండల కో–ఆప్షన్ సభ్యులు భాస్కరరావు, సర్పంచ్‌లు దున్న బాలరాజు, కె.శ్రీను, మామిడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి

పొందూరు : గృహనిర్మాణ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి గృహ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశించారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులపై సంబంధిత అధికారులు, నాయకులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు సంబంధించి పట్టాలు అందుకున్న లబ్ధిదారులు ఇళ్లు నిర్మిస్తున్నారో, లేదో తెలుసుకోవాలన్నారు. నిర్మాణాలు చేపట్టని పట్టాలను రద్దు చేసి, అర్హులైన కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసి అందజేయాలని ఏడాది కిందట చెప్పినా, ఆ దిశగా ఇంతవరకు ఎందుకు చర్యలు చేపట్టలేదని అధికారులను ప్రశ్నించారు. జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహాలకు జియోట్యాగింగ్ చేయడం ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. జియోట్యాగింగ్ చేయని కారణంగా ఇళ్ల బిల్లులు రావడం లేదని, దీనిపై నాయకులకు గానీ, లబ్ధిదారులకు గానీ గృహనిర్మాణ శాఖ అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని జెడ్‌పిటిసి సభ్యులు లోలుగు కాంతారావు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. గృహనిర్మాణశాఖ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా లబ్ధిదారులకు న్యాయం చేయలేకపోతున్నామని వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్ అన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులు జియోట్యాగింగ్ చేయకపోతే లింటల్ లెవల్ వరకు నిర్మాణం చేసి శ్లాబ్ వేయకుండా జియోట్యాగింగ్ చేయించుకోవాలని గృహనిర్మాణ సంస్థ పీడీ ఎన్.గణపతి తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ ఎస్.రాంబాబు, హౌసింగ్ డిఇ కె.మౌళి, ఎఇ రమణ, పొందూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ ఆర్.లక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

రెండు పూటలా పని వద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి కూలీలకు రెండు పూటలా పని విధానం సరికాదని, తక్షణమే ఈ విధానాన్ని నిలుపుదల చేసి పాత విధానాన్ని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం రూరల్ మండలం తండ్యావలసలో శనివారం ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి చట్టంలో పనిచేసే కార్మికులకు కొలతల ప్రకారం కూలి ఇస్తున్నారని, రోజు కూలి పని విధానం అమలు చేస్తే తప్ప రెండు పూటలా ఎందుకు పనిచేయాలని ప్రశ్నించారు. చట్టంలో కూలీల పని గంటల నిబంధన లేదని స్పష్టం చేశారు. పొద్దు పొడవక ముందే పనికి వెళ్లి 11 గంటల తర్వాత ఇళ్లకు చేరుకుంటున్నారని, అది చూసి పెత్తందారులు ఉపాధి కూలీలపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఉపాధి చట్టం ఉంటే పెత్తందారుల మాట చెల్లుబాటు కావడం లేదని, అందువల్ల ఈ చట్టాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. వేసవి భృతి 40 శాతం చెల్లించాలని, వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం పని కల్పించాలన్నారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో కూడా పని కల్పించాలన్నారు. పనిచేసే చోట కనీస సౌకర్యాలైన టెంటు, మంచినీళ్లు, మెడికల్ కిట్ ఉంచాలని డిమాండ్ చేశారు. నీళ్లకు రూ.పది, గునపాం, పారకు పదును పెట్టడానికి రూ.50, తట్టకు రూ.20 చెల్లించాలని కోరారు. ఆన్‌లైన్ మస్టరు విధానాన్ని రద్దు చేసి, పాత పద్ధతిని అమలు చేయాలన్నారు. పే స్లిప్పులు ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో మేట్లకు స్మార్ట్‌ఫోన్లు ఇచ్చి రూ.ఐదు పారితోషికం చెల్లించాలని చెప్పారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 25న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో ఉపాధి కూలీలందరూ పెద్దసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కూలీలతో మాట్లాడుతున్న సింహాచలం

వారం రోజుల్లో నగదు జమ

రణస్థలం రూరల్ : మొక్కజొన్న కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని వ్యవసాయశాఖ మేనేజింగ్ డైరెక్టర్, మార్కెటింగ్‌శాఖ కమిషనర్ రాహుల్ పాండే తెలిపారు. రణస్థలం రైతుభరోసా కేంద్రం–1లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులు పండించిన పంటల తేమ శాతాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా మొక్కజొన్న రూ.1962గా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. మొక్కజొన్న సాగు చేసి ఈ–క్రాప్, ఇకెవైసి చేయించుకున్న రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పంటను విక్రయించుకోవాలని సూచించారు. దీనివల్ల రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. ఆయన వెంట మార్కెటింగ్‌శాఖ జిల్లా డైరెక్టర్ రమణి, వ్యవసాయ సంచాలకులు వడ్డాది శ్రీనివాసరావు, ఎఓ డి.విజయభాస్కర్, సిబ్బంది ఉన్నారు.

పరిశీలిస్తున్న రాహుల్ పాండే

జగన్‌ను గద్దె దించాలి

శ్రీకాకుళం : జగన్ నాలుగేళ్ల పాలనలో బిసిలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఆయన్ను గద్దె దించాలంటే బిసిల సత్తా చూపించాలని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ పిలుపునిచ్చారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసిల అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన నిధులను దారిమళ్లించారని విమర్శించారు. బిసిలను ఏకం చేస్తూ ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు పోరుబాటకు పిలుపునిచ్చారు. జగన్‌ను గద్దె దించాలన్న నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని స్పష్టం చేశారు. సమావేశంలో టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కలగ జగదీష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శిల్లా శ్రీనివాసరావు, బిసి సెల్ ఇన్‌ఛార్జి దుమ్ము అశోక్, బిసి సెల్ సోషల్ మీడియా కన్వీనర్ బుక్కా యుగంధర్, బిసి సెల్ నగర అధ్యక్షులు ఉంగటి వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

నమ్మకం పోతే నిలదీతలే...

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉద్దానం ప్రాంతానికి అది చేస్తున్నాం, ఇది చేస్తున్నామంటూ గొప్పలు చెప్తున్న ప్రభుత్వం.. రైతులు పండిన జీడి పంట కొనుగోలు, మద్దతు ధరపై మాత్రం మాట్లాడడం లేదు. జిల్లాలో ఉద్యాన పంటల్లో కొబ్బరి తర్వాత జీడి ప్రధానంగా సాగవుతోంది. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు. జిల్లాలో పండే జీడి పంట అత్యంత నాణ్యమైందనే గుర్తింపు దక్కించుకుంది. రైతులకు మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదు. పలాస జీడి పరిశ్రమలకు జీవనాడిగా ఉన్న, రైతులకు మాత్రం కష్టమే మిగులుతోంది. గతంలో 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.14 వేల వరకు ఉండగా, ఇప్పుడు అదే బస్తాకు రూ.తొమ్మిది వేలు లోపే పలుకుతోంది. గతంలో కేజీ జీడిపప్పు ధర రూ.650 ఉన్నప్పుడు 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.10 వేలు నుంచి రూ.11 వేలు వరకు ధర దక్కేది. ఇప్పుడు జీడిపప్పు ధర కేజీ రూ.850కు పెరిగినా పిక్కల ధర మాత్రం తగ్గిపోవడం మార్కెట్ మాయాజాలానికి అద్దం పడుతోంది.

దళారులు, వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై జీడి రైతులు బతకడం అలవాటుగా మారిపోయింది. జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని, ప్రభుత్వమే పంటను కొనుగోలు చేయాలని చాలా ఏళ్లుగా రైతు సంఘాలు, జీడి రైతులు పోరాడుతూనే ఉన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020 ఫిబ్రవరిలో ధర్నాలు, ముఖ్యమంత్రికి పోస్టుకార్డుల ద్వారా తెలియజేయడం వంటి కార్యక్రమాలతో ఆందోళనలు చేశారు. అదే ఏడాది అక్టోబరులో జీడి పంటకు మద్దతు ధర ప్రకటిస్తుందని, ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందంటూ హామీనిచ్చారు. కొన్ని నెలలు గడిచిన తర్వాత జీడి పిక్కలకు మద్దతు ధర ప్రభుత్వం ప్రకటిస్తుందని అది క్వింటాకా?, బస్తాకా? అనే విషయంలో స్పష్టత వచ్చాక ఉత్తర్వులు వస్తాయంటూ పశుసంవర్ధకశాఖ సీదిరి అప్పలరాజు ప్రకటించారు. ఇదిగో అదిగో జిఒ వచ్చేస్తుందంటూ కొన్నాళ్లు కాలయాపన చేశారు. ఇప్పటికీ ప్రభుత్వం జిఒను వెలువరించలేదు. అంతకుముందు జీడి పిక్కల మద్దతు ధరపై రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించి బస్తాకు వ్యాపారులు రూ.తొమ్మిది వేలు చెల్లించాలని, ప్రభుత్వం రూ.వెయ్యి రైతులకు ఇస్తుందని హామీనిచ్చారు. అమాత్యుని హామీలకే దిక్కు లేకపోతే ఇక రైతులు ఎవరిని విశ్వసించాలి? జీడి పంట కొనుగోలు, మద్ధతు ధర విషయంలో ప్రభుత్వం తమను వంచించిందని రైతులు



అనుకుంటే అది ప్రభుత్వానికే నష్టం తెస్తుంది.

జీడి రైతుల సమస్యలపై అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఏనాడూ పట్టించుకోని టిడిపి ఈసారి నిరసనలు చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయమే. వజ్రపుకొత్తూరు మండలం పూండీలో ఈనెల 11న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళన చేశారు. జీడి పిక్కలకు 80 కేజీల బస్తాకు రూ.16 వేలకు కొనుగోలు చేయాలంటూ డిమాండ్ చేశారు. బస్తాకు రూ.వెయ్యి చొప్పున ఇస్తామంటూ మంత్రి అప్పలరాజు మాయమాటలు చెప్పి రైతులను మోసగించారంటూ విమర్శలకు దిగారు. తాము అధికారంలో ఉండి చేయలేకపోయిన కొన్ని డిమాండ్లనూ ప్రభుత్వ ముందుంచారు. జీడిపిక్కలకు నిల్వ కేంద్రాలు, పంటకు ఇన్సూరెన్స్ కల్పించాలంటూ డిమాండ్ చేశారు. జీడి రైతులకు నాయ్యం చేయకపోతే మరోసారి వారి తరుపున దీక్షకు దిగుతానని హెచ్చరించారు. రైతుల పక్షాన నిజంగా నిలబడి పోరాడితే వారికి కొంతవరకైనా మేలు చేకూరుతుంది. రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని, తమ హయాంలో జీడి రైతులకు న్యాయం జరిగేలా మధ్యవర్తిత్వం వహిస్తానని చెప్పడంపైనే అందరికీ సందేహాలు కలుగుతున్నాయి. మంత్రి అప్పలరాజు ఇప్పటివరకు అదే పనిచేశారు. ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ లేకపోవడంతో ఏ ప్రభుత్వంపైనైనా జనానికి ఏం నమ్మకం ఉంటుంది.

ప్రజల సమస్యలు, వారికి ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజల్లో పాలకులపై క్రమేణా విశ్వాసం సన్నగిల్లుతుంది. వారిపై అసహనం, ఆగ్రహం క్రమేణా పెరుగుతుంది. చివరకు వారిని నిలదీసే వరకు వెళ్తుంది. పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు ఈనెల 12వ తేదీన మందసలో ఇదే అనుభవం ఎదురైంది. మందస మండలం చీపి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వెళ్లిన ఆయన్ను ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ గిరిజన యువకులు నిలదీశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదంటూ టిడిపిపై నెట్టేసినా, నాలుగేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం చేసేందేమిటో గిరిజనులకు తెలియదనుకుంటే తప్పులో కాలేసినట్టే. జనానికి హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత సాకులు చెప్పే ప్రజాప్రతినిధులు, నాయకులను జనం గుర్తుంచుకుని సరైన సమయంలో బుద్ధి చెప్తారు.

ట్రోఫీని అందజేస్తున్న రాంబాబు, నాగేంద్ర

క్రికెట్ టోర్నీ విజేత అయ్యవారిపేట

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో తోటవాడలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సేపేన ప్రకాశరావు స్మారక టోర్నమెంట్ విజేతగా అయ్యవారిపేట జట్టు నిలిచింది. చివరి మ్యాచ్ శనివారం తోటవాడ అంబేద్కర్ టీం-అయ్యవారిపేట టీం తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన పోటీలో అయ్యవారిపేట జట్టు విజయతీరాలకు చేరింది, విన్నర్ టీంకు రూ.5 వేలు, ట్రోఫీ, రన్నర్ టీంకు రూ.2 వేలు, ట్రోఫీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మామిడివలస ఎంపిటిసి గుమ్మడి రాంబాబు, జనసేన పార్టీ మండలం కన్వీనర్ కొత్తకోట నాగేంద్ర అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు సేపేన సాయికుమార్, రాజేష్, స్వరూప్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న ఇందిరాప్రసాద్

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలో తోడ్పాటు అందిస్తాయని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థల కో-ఆర్డినేటర్ జి.ఇందిరాప్రసాద్ అన్నారు. బాక్సింగ్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన పౌష్టికాహారాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రతిఒక్కరూ వేసవి సెలవుల్లో ఏదో ఒక క్రీడల్లో శిక్షణ పొందాలన్నారు. దిన చర్యల్లో నడక, నవ్వు భాగం చేసుకోవడంతో పాటు క్రీడల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ కె.వి.ఆర్.మూర్తి, స్టార్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, సీనియర్ బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ కణితి మధుసూదన్, సీనియర్ న్యాయవాది టి.బాలమురళీకృష్ణ, వాకర్స్ ప్రతినిధులు ఎస్.సంజీవరావు, బాక్సింగ్ సహాయ కోచ్ రాజీవ్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు సులభంగా పరిష్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ శనివారం జాతీయ లోక్ అదాలత్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు అధ్యక్షులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జునైద్ అహ్మద్ మౌలానా వారి ఆధ్వర్యాన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 20 లోక్ అదాలత్ బెంచులు ఏర్పాటు చేసి శ్రీకాకుళం, ఆముదాలవలస, ఇచ్ఛాపురం, కోటబొమ్మాళి, నరసన్నపేట, పాలకొండ, పలాస, పాతపట్నం, పొందూరు, కొత్తూరు, రాజాం, సోంపేట, టెక్కలి కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఫణికుమార్ అడిషనల్, సీనియర్ సివిల్ జడ్జ్ అనురాధ, జ్యుడిషియల్ మ్యాజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ శారదాంబ, శ్రీభరణి పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవ సంస్థ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు కక్షిదారులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: గ్రామాల్లో చిన్నచిన్న తగాదాలతో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకొని న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే కంటే రాజీ మార్గం ఎంచుకొని జాతీయలోక్ ఆదాలత్ ద్వారా సులభంగా కేసులు పరిష్కరించుకోవచ్చునని శ్రీకాకుళం స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్,

మాట్లాడుతున్న జిల్లా జడ్జి అహ్మద్ మౌలానా

మండల న్యాయ సేవా సంఘం ఇన్‌ఛార్జి అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీభరణి అన్నారు. స్థానిక జూనియర్ కోర్టులో జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ లోక్‌ఆదాలత్‌లో బెంచ్ సభ్యులుగా వెలమల అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాది ఎల్.గోవిందరావు, స్వచ్ఛంద కార్యకర్త వ్యవహరించారు. లోక్‌అదాలత్‌లో మొత్తం 420 కేసులు పరిష్కరించామని తెలిపారు. ఇందులో 75 క్రిమినల్ కేసులు, 343 పెట్టీ కేసులు, 2 సివిల్ దావాలు పరిష్కరించామని అన్నారు. కార్యక్రమంలో రెండో తరగతి మేజిస్ట్రేట్ సీపాన భాస్కరరావు, న్యాయవాదులు సంపతిరావు శ్రీధరరాజు, కె.వెంకటరావు, కోర్టు కానిస్టేబుల్ బి.బాలకృష్ణ, వెంకటరావు, నాగరాజు, ఆశోక్ పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 372 కేసులు పరిష్కారమయ్యాయని బార్ అసోసియేషన్ అధ్యక్షులు, లోక్‌అదాలత్ మెంబర్ దివ్వల వివేకానంద తెలిపారు. ఈ అదాలత్‌లో సోంపేట సివిల్ జడ్జి కోర్టు ఇన్‌ఛార్జి జె.శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి డి.భరణి, న్యాయవాదుల సంఘం సోషల్ వర్కర్ బి.శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక కోర్టుల సముదాయం వద్ద నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 526 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జ్ పరేష్ కుమార్లు న్యాయమూర్తులుగా వ్యవహరించారు. సివిల్ కేసులు రెండు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు నాలుగు, క్రిమినల్ కేసులు 14, బ్యాంకు ప్రీ లిటిగేషన్ కేసులు మూడు, సిసి అడ్మినిస్ట్రేషన్ కేసులు 27, న్యూసెన్స్ కేసులో 476 మొత్తం 526 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు. కార్యక్రమంలో కె.గోవర్ధన్‌రావు, ఎన్.జ్ఞానంనంద బెనర్జీ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గోకర్ణపల్లిలో సర్పంచ్ చింతాడ మాధురి అధ్యక్షతన శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ? లేనిది? అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే నేరుగా గ్రామ సచివాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లగా... అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు చింతాడ

పొందూరు : పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

సత్యప్రసాద్, జి.అప్పలనాయుడు, చింతాడ జీవరత్నం భాస్కర్, కిల్లి నాగేశ్వరరావు, చింతాడ రాజశేఖర్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీలో వెంకటాపురం, జంతురు, ఎగువబందపల్లి, బంద పల్లి కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు ఎఒ దానకర్ణుడు, సర్పంచ్‌లు బెజ్జిపల్లి జయమ్మ, పాపారావు పాల్గొన్నారు.

'ఉపాధి' హామీని కాపాడుకుందాం

నందిగాం : ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి ఈ నెల 25న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు నందిగాంలోని అగురువాని చెరువులో పనులు చేస్తున్న కూలీలతో శనివారం మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. వంద రోజులు పూర్తి చేసిన కుటుంబానికి అదనంగా పని కల్పించాలన్నారు. గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ పని కల్పించాలని డిమాండ్ చేశారు. పనిచేసే చోటా కనీస సౌకర్యాలైన టెంటు, తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు.ఆన్‌లైన్ మాస్టర్ చేసే విధానాన్ని రద్దు చేసి, పాత పద్ధతిని అమలు చేయాలన్నారు. సిఐటియు నాయకులు పి.సాంబమూర్తి, ఎం.దాలయ్య పాల్గొన్నారు.

నందిగాం : కూలీలతో మాట్లాడుతున్న ఎల్లయ్య

మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణం రాణిపేట కూడలి వద్ద శనివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో గుమ్మాసమితిగైబ పంచాయతీ బలువార్డకు జాష్మంత్ గోమాంగో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వగ్రామం నుంచి బైక్ వస్తుండగా... ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని జాష్మంత్ శరీరంపై టైరు వెళ్లిపోయింది. దీంతో శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో నాలుగు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు చిత్తిరి సింహాద్రి ఘటనాస్థలానికి చేరుకుని చర్చించారు. బాధితులకు న్యాయం చేస్తామని లారీ యజమాని హామీ ఇచ్చారు. మృతుడు తండ్రి జోషప్ గోమాంగో ఫిర్యాదు మేరకు పర్లాకిమిడి ఐఐసి బబులి నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న వెంకటరమణ

రేపు సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఈ నెల 15న కొత్తూరు మండలంలో సంఘీభావ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో, యూనిట్ ఇన్‌ఛార్జిలతో, నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తికానున్న సందర్భంగా సంఘీభావంగా కొత్తూరులో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో చేపడుతున్న ఓటర్ వెరిఫికేషన్, హౌసింగ్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్ జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, వసంత్, భాస్కరరావు, మాలతి శ్రీధర్, పరమేష్, గణపతి, శేఖర్, పైడిరాజు, శ్రీను పాల్గొన్నారు.

గర్భిణితో మాట్లాడుతున్న చిన్నరాజులు

టీకాలు తప్పనిసరి

జలుమూరు: గర్భిణులు సకాలంలో టీకాలు వేయించుకోవడం వల్ల శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జలుమూరు పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ చిన్న రాజులు అన్నారు. మండలంలోని గొల్లపేట అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం సందర్శించి గర్భిణులకు టిడి టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా మొదటి బుధవారం, రెండో శనివారం మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు సందర్శించి గర్భిణులకు, అప్పుడే పుట్టిన శిశువు నుంచి సంవత్సరం వయసు ఉన్న శిశువుకు టీకాలు వేస్తున్నామని అన్నారు. ఈ టీకాలు వల్ల శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి క్షయ, పోలియో, కంఠసరి, కోరింత దగ్గు, ధను ర్వాతం, పచ్చకామర్లు, నీళ్ల విరోచనాలు, నిమోనియా, మెదడువాపు, తట్టు, రూబెల్లా తదితర వ్యాధులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఆదిలక్ష్మి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మజ్జిగను అందజేస్తున్న ఎస్ఐ ప్రవల్లిక

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండుటెండలను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీరుస్తున్న జిల్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని వన్ టౌన్ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక అన్నారు. నగరంలోని డే అండ్ నైట్ కూడలి దరి విజయగణపతి ఆలయ ఆవరణలో మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. సుమారు 600 మంది బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. రానున్న వారాంతంలో వేసవి వేడిగాలులకు వడదెబ్బలు వచ్చే అవకాశాలున్నాయని, బయటకు వచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వృద్ధులకు, పిల్లలకు అధిక నీరు అవసరమని, వేసవి తాపానికి ఉపశమనంగా మజ్జిక తాగాలని అన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ పిఎస్ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది, ఆలయ అర్చకులు, జిల్ ఫౌండేషన్ సభ్యులు సాయి, న్యూ బ్లడ్ బ్యాంకు సభ్యులు నంది ఉమాశంకర్, శివ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల్లో ఖాళాగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సిడిఒ డోల పాపినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఖాజీపేటలో అంగన్వాడీ కార్యకర్తకు, చిన్నరావుపల్లి, బలిజిపేట, కింతలి మిల్లు, రామదాసుపురం, పెంట, బొంతలకోడూరు, మదుపాం అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 19వ తేదీ లోగా సంబంధిత కార్యాలయానికి దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు.

సిబిఎస్ఇ ఫలితాల్లో 'జ్ఞానభారతి' విజయభేరి

అభినందిస్తున్న జోహార్‌ఖాన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిబిఎస్ఇ పదో తరగతి ఫలితల్లో జ్ఞానభరతి విద్యా సంస్థ శత శాతం ఫలితాలు సాధించి జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించిందని విద్యా సంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్ శనివారం తెలిపారు. తమ సంస్థలో విద్యార్థులు అసమాన ప్రతిభ కనబరిచి నూటికి నూరు శాతం ఫలితాలు సాధించిందన్నారు. ఇందులో సాలీనా అక్షయ కుమార్ 95 మార్కులు సాధించి ప్రథమ స్థానం, దినేష్ కుమార్ గౌడ్ 92 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారని అన్నారు. దీంతో పాటు 80 శాతం మార్కులు సాధించిన 23 మంది ప్రథమ స్థానంలో, 33 మంది ద్వితీయ స్థానంలో నిలిచారని అన్నారు. ఈ ఫలితాల్లో మరో 8 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 98 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు విద్యాసంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్, ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్ మిస్సెస్ రషీద్ సుల్తాన్‌లు ప్రత్యేకంగా అభినందించారు. సిబిఎస్ఇ పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బోధన చేసిన అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ ప్రేమ సర్తాజ్ ఖాన్, మేనేజర్ ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రేపట్నుంచి శిక్షణ

ఆమదాలవలస : కొబ్బరి చెట్టు ఎక్కే ప్రక్రియను సులభతరం చేయడానికి రైతుల కోసం ఆరు రోజులు పాటు వృత్తి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 29 వరకు ఈ శిక్షణా కార్యక్రమాలను స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 20 మంది రైతులకు శిక్షణను ఇచ్చి వారు తద్వారా వృత్తి సంపాదించుకోవాలన్న ఉద్దేశంతో కొబ్బరి అభివృద్ధి సంస్థ ప్రభుత్వ ఆర్థిక సౌజన్యంతో కొబ్బరి చెట్టు ఎక్కే యంత్రాలను రైతులకు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ 8281440912 నంబుకు సంప్రదించి ఒక రోజు ముందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కొబ్బరి చెట్టు ఎక్కే యంత్రాన్ని ఏ విధంగా వాడాలి, వివిధ ఎత్తు గల చెట్లను ఏ విధంగా ఎక్కాలో ఆరు రోజుల పాటు శిక్షణను ఇస్తారని తెలిపారు. అలాగే రైతులకు సంబంధించిన వివిధ అంశాలపైన బ్యాంకింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. వీటితో పాటుగా యోగా, జాగింగ్, ప్రథమ చికిత్సలపై ఆరోగ్య భద్రతపైనా శిక్షణను అందిస్తున్నామని తెలిపారు.

ప్రముఖుల సందర్శన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలో గ్రామ దేవత సంబరాలను శనివారం కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి తిలకించారు. ముందుగా గ్రామ దేవత ఆలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. మరో రెండు రోజుల్లో ఉత్సవాలు ముగుస్తున్న నేపథ్యం ప్రజల తాకిడి పెరిగింది. గత రాత్రి జ్ఞాన భారతి విద్యాసంస్థల సమీపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం పల్సర్ బైక్ ఝాన్సి, జబర్దస్త్ నటుల కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి ఆమదాలవలస సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి టౌన్-1 ఫీడర్ పరిధిలో ఉన్న శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డు వెడల్పు పనుల కారణంగా పొడవాటి స్తంభాలు మార్చడం, విద్యుత్ తీగలు అమరచడం పాత విద్యుత్ లైన్లు తొలగిస్తున్నామని అన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం, కంచరవానిపేట, లంకాం, రైస్ మిల్ అండ్ బ్రిక్ ఇండస్ట్రీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి విద్యుత్‌శాఖ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

టెక్కలి రూరల్ : మండలంలోని 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధి ఆదిఆంధ్రవీధిలో మరమ్మతులకు గురైన హెచ్ఐవిసిబిని ఆదివారం అమరుస్తున్నామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. అంజినపురం, మేఘవరం గ్రానైట్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాధితునికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : మండలంలోని బొడ్డకలిలో జన సైనికుడు లండ శ్రీనివాసు గత కొద్ది రోజుల కిందట అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాదాపు రూ.3 లక్షల దాకా ఖర్చు చేశారు. వీరి పరిస్థితి తెలుసుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన నాయకులు, పవన్ సేన సమితి తరపున రూ.4 వేలు జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో డంబురు రెడ్డి, శ్రీధర్, కృష్ణ, ధర్మరాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న దుర్యోధనరెడ్డి

మాట్లాడుతున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

నీటిఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

నీటిఎద్దడి నివారణకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్‌పిటిసి దువ్వాడ వాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్‌పిటిసి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే భూ రీ సర్వే నిస్పక్షపాతంగా చేపట్టాలన్నారు. అధికారులు ఎవరైనా లంచం అడిగితే 1902కు ఫోన్ చేసి న్యాయం పొందవచ్చునని తెలిపారు. పట్టణ పరిధిలో ఒక ఎంపిటిసి పరిధిలో మరొకరికి పనులు కేటాయిచడంపై గొల్లవీధి ఎంపిటిసి వాకాడ శ్రీధర్ ప్రశ్నించారు. బోర్లు మరమ్మతులకు ప్రభుత్వం ఎటువంటి సహాయ సహకారాలు చేయడం లేదని, తన సొంత ఖర్చులతో బోర్లను బాగు చేయించుకుంటున్నామని శ్రీధర్ సభ దృష్టికి తీసుకొచ్చారు. బోర్ల మరమ్మతులకు ఎవరూ ఎటువంటి సొంత నిధులు ఖర్చులు చేయాల్సిన అవసరం లేదని, మరమ్మతులకు సంబంధించి సామగ్రి అంతా అందుబాటులో ఉంచామని ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సమాధానం చెప్పారు. ప్రతి శుక్రవారమూ నిర్వహించే వ్యవసాయ సలహా మండలి సమావేశాలకు ఎంపిపికి, జెడ్‌పిటిసికి సమాచారం ఇవ్వకపోవడంపై ఎఒ రాహుల్ కుమార్‌ను నిలదీశారు. పశుసంవర్ధకశాఖ అధికారి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు ఎటువంటి వ్యాధులు రాకుండా ఇంజెక్షన్లు వేస్తున్నామని చెప్పారు. ముందుగా ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారి కె.వి.ఆర్.మూర్తి అజెండాను చదివి సభలో వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఎపిఎం కూర్మారావు

పనితీరులో నిర్లక్ష్యం వద్దు

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్వయం శక్తి సంఘాల అభ్యున్నతికి గ్రామీణ ప్రాంతంలో నిరంతరం పనిచేస్తున్న సిబ్బంది పనితీరులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు సిబ్బందిని హెచ్చరించారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామ సంఘాల్లోని మహిళా పొదుపు సంఘాలు నిత్యం జరుపుతున్న ఆర్థిక లావాదేవీలపై సభ్యులందరికీ అవగాహన, సరైన పుస్తక నిర్వహణ ఉండాలని సూచించారు. ప్రతి సంఘమ పంచసూత్రాలు పాటించేటట్లుగా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపైన ఉందని తెలిపారు. లావాదేవీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రక్రియ అయిన మొబైల్ బుక్ కీపింగ్ షెడ్యూల్ ప్రకారం ఏ గ్రేడ్‌లో ఉండేటట్లు పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు చంద్రావు, రమణ, సుభద్ర, ఉమా, రామప్పడు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.అనురాధ సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. 8 నుంచి 22 వారాల గర్భిణులను స్కానింగ్ సెంటర్‌కు తీసుకురావాలన్నారు. జ్వర పీడితుల నుంచి తప్పనిసరిగా రక్త పూతలను సేకరించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అన్ని యాప్‌ల లక్ష్యాలను, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను పూర్తి

రికార్డులను పరిశీలిస్తున్న అనురాధ

చేయాలని సూచించారు. టిబి కేసుల నమోదు స్క్రీనింగ్ విధానం, చికిత్సా విధానం కార్డ్ పూర్తి చేసే విధానం గురించి సలహాలు, సందేహాలు ఇవ్వాలన్నారు. విధినిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజశేఖర్, పావని, సిబ్బంది సతీష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రకాష్

ప్రకృతి వ్యవసాయం ముద్దు

ఇచ్ఛాపురం: ప్రకృతి వ్యవసాయంతో పంటలు అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి ప్రకాష్ అన్నారు. మండలంలోని మశాఖపురంలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పిస్తూ... పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎంత మొత్తం విస్తీర్ణంలో నవధాన్యాల సాగు చేస్తున్నారు... పూర్తిగా ప్రకృతి సేద్యంలోకి మారడానికి రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జీవ వైవిధ్యం పెరిగి వివిధ పంటల వేర్లు భూమిలో వివిధ సూక్ష్మ జీవులను ఆశ్రయం ఇస్తుందన్నారు. తద్వారా ప్రధాన పంటకు కావాల్సిన అన్ని పోషకాలూ లభిస్తాయని అన్నారు. నేలలో సేంద్రీయ కర్బన్ శాతం పెరుగుతుందన్నారు. చీడపీడలు, తెగుళ్లను తట్టుకుంటుందని పేర్కొన్నారు. పశువులకు పచ్చి మేతగా నవధాన్య పంటలు ఉపయోగపడతాయని అన్నారు. ప్రధాన పంటలో దిగుబడులు పెరుగుతాయన్నారు. సర్పంచ్ మాధవరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ, తులసయ్య, నాగమణి, రూప పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కర్ణాటక రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయాన్ని అందుకోవడం ఆనందదాయకమని, దీంతో కాంగ్రెస్ వైపు ప్రజలు చూస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు శనివారం నిర్వహించారు. ముందుగా బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కన్నడ రాష్ట్రంలో బిజెపి అనుసరించిన ప్రజా వ్యతిరేక, మతతత్వ, విద్వేషపూరిత రాజకీయాలను ప్రజలు తెలుసుకుని బిజెపికి బుద్ధి చెప్పారన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచి, బిజెపిని తరిమికొట్టాలని ఆమె ప్రజలను కోరారు. కార్యక్రమంలో సనపల అన్నాజీరావు, దేశళ్ల గోవింద మల్లిబాబు, రెల్ల సురేష్, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, మంత్రి నరసింహమూర్తి, కూరాకుల వెంకటరావు, లఖినేని సాయిరాం, లఖినేన సునీల్, అంబటి దాలినాయుడు, రెహమాన్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కోత మధుసూదనరావు అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాన్ని ఉద్దేశించి మాట్లాడారు. మత రాజకీయాలతో ముడిపెట్టి లబ్ధిపొద్దలకున్న బిజెపిని కర్నాటకలో ప్రజలు తిరస్కరించారని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేయడం, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మయడం, ప్రభుత్వాలను కూలదోయడం, మతవిద్వేసాలను రెచ్చగొట్టడం, ప్రతిపక్షాలపై కక్ష సాధింపులకు దిగడం, నిరుద్యోగం, మితిమీరిన అప్పులు,

శ్రీకాకుళం అర్బన్ : సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

విఫలమైన మోదీ సర్కార్ ప్రజల తిరస్కరణకు గురైందని వారు విమర్శించారు. కర్నాటకలో విజయానికి కృషి చేసిన ఎపి పిసిసి అధ్యక్షులు గొడుగు రుద్రరాజు, కాంగ్రెస్ నాయకులు రఘువీరారెడ్డి, రాజేష్‌రెడ్డి, జంగా గౌతం, సుంకర పద్మ అభినందనలు తెలిపారు.

రణస్థలం రూరల్ : కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, బిసి సెల్ కన్వీనర్ కొత్తకోట్ల సింహాద్రినాయుడు, డిసిసి ప్రధాన కార్యదర్శి కొత్తకోట్ల లక్ష్మి, మండల అధ్యక్షులు జోగినాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.జగదీష్‌నాయుడు, మీసాల గణేష్, బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.